# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 80 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 18 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## బీహార్‌లో బిజెపి ఓట్ చోరీ సుస్పష్టం

### పిసిపి చీఫ్ మహేశ్, మంత్రి పొన్నం విమర్శలు

**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే ఉదయం)**

బీహార్‌లో దొడ్డి దారిన ఎన్డీయే కూటమి విజయం సాధించిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.. ఓట్ చోరీ నీ నిరసిస్తూ గాంధీ భవన్ ముందు యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు జరగాలన్నారు. యువజన కాంగ్రెస్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్ని చైతన్య వంతం చేసే విధముగా ఉందని కొనియాడారు. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఓటు విలువ తెలియక ఉండటం శోచనీయమన్నారు. బీహార్ ఎన్నికల్లో సామాన్యులకు తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓటు శాతం తక్కువగా వచ్చి ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.



## డిసెంబర్ రెండోవారంలో
# స్థానిక ఎన్నికలు

### ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్

### కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్

### ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం

**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే ఉదయం)**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహిం చాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం


## రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారమా..!!

**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక ఫలితాలు ఒక మలుపును తెచ్చాయి. నవంబర్ 14న ప్రకటించిన ఫలితాల ప్రకారం, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ వి. 98,988 ఓట్లతో 24,729 మెజారిటీతో విజయం సాధించారు. ఇది కాంగ్రెస్ కు బిహార్ లోని ఓటమి తర్వాత ఒక మంచి శుభ పరిణామం,శుభవార్త. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాజకీయ పట్టును మరింత బలపరిచింది. బీఆర్‌ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) బలమైన కోటగా ఉన్న జూబ్లీహిల్స్‌ను కాంగ్రెస్ బద్దలు కొట్టడం , 2014, 2018, 2023 ఎన్నికల్లో ఓడిన తర్వాత ఇది పార్టీకి పెద్ద ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది అని చెప్పవచ్చు.

ఈ ఉపఎన్నిక ఎందుకు? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలిచిన స్థానం, ఆయన ఆకస్మికంగా మరణించారు అందువల్ల ఈ స్థానం ఖాళీ అయింది. ఇక్కడి ఓటర్లు హైదరాబాద్‌లోని అల్ప సంఖ్యాకులు, బీసీలు, ఇతర సామాజిక వర్గాలు రాజకీయాల్లో గెలుపు ఓటముల లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈఎన్నికల్లో 48.42% మాత్రమే పోలింగ్ జరిగినప్పటికీ, కాంగ్రెస్ బీసీ-ముస్లిం సంకీర్ణతలను బలోపేతం చేసుకుని విజయం సాధించడం గమనార్హం..ఇది తెలంగాణలో కొత్త సామాజిక కూటముల ఆవిర్భావాన్ని సూచిస్తోంది, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,రైతు భరోసా, మహిళల ఉచిత రవాణా ఓటర్లను ఆకర్షించాయని చెప్పుకోవచ్చు. హైదరాబాద్లో

బీఆర్‌ఎస్‌కు ఇది మరో ఎదురు దెబ్బ. ఎక్కువ కాలం అధికారంలో ఉండి, జూబ్లీహిల్స్‌ను 'కోట'గా చేసుకున్న పార్టీ, ఇప్పుడు అంతర్గత కలహాలు, అభ్యర్థి ఎంపికలో



వివాదాలు, బలహీన ప్రచారంతో బలహీనపడింది. బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఈ ఓటమిని అంగీకరించి, పార్టీని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. కానీ, ఫలితాల తర్వాత రాహ్మత్‌నగర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ఘటన రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతను తెచ్చింది.కేటీఆర్ ఈ దాడిని 'కాంగ్రెస్ గూండాయిజం'గా అభివర్ణించారు.దాడిని ఖండించి, గాయపడిన రాకేశ్ కు సహాయం చేశారు.ఇది పార్టీల మధ్య శత్రుత్వాన్ని మరింత ఊపందుకునేలా చేసింది, సోషల్ మీడియాలో కవితలు వ్యంగ్యాలు రేవంత్-కేటీఆర్ మధ్య ట్వీట్ వార్ ఆశక్తి రేపుతోంది. ఇదిలా ఉండగా బీజేపీ అభ్యర్థి లంకల డీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయిన విషయం గమనార్హం. తెలంగాణలో బీజేపీ బలపడుతున్నప్పటికీ, ఈ ఉపఎన్నికలో మూడో స్థానంలో నిలబడటం పార్టీకి సవాలుగా మారింది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్-బీఆర్‌ఎస్ మధ్య మాటలయుద్ధాన్ని మరింత పెంచుతుంది, బిజెపి బిఆర్ ఎస్ కు బి టీం అని కాంగ్రెస్ ఆరోపిస్తూ ఉండగా, బిజెపి, కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని బిఆర్ ఎస్ ఆరోపిస్తుంది. కాగా బీజేపీ పార్టీకి హైదరాబాద్లో బలపడటానికి మరింత సమయం పడుతుందని ఓ అంచనా.ఈ ఫలితాల తర్వాత రాజకీయ పరిణామాలు ఏమిటి? ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తన సంక్షేమ వాగ్దానాలను మరింత వేగంగా అమలు చేయాల్సిన ఒత్తిడి పెరిగింది. రేవంత్ రెడ్డి ఈ విజయాన్ని 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు గెలుపుగా మలచుకోవచ్చు. మరోవైపు, బీఆర్‌ఎస్‌లో నాయకత్వ సవాళ్లు తలెత్తుతున్నాయి. కేసీఆర్ కుటుంబ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఇతర నాయకులు గొంతు కలపవచ్చు. ఎన్నికల సంఘం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఎత్తివేసినప్పటికీ, ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ దాడులు క్రమంగా పెరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని ఎలా చూస్తారు? ఓటర్లు అభివృద్ధి, ఉపాధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారు తప్ప గొడవలు కాదు. పార్టీలు ఈ ఉపఎన్నిక ఫలితం చూసుకుని, ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాగ్దానాలను నెరవేర్చడంతో పాటు, రాజకీయ శత్రుత్వాలను తగ్గించాలి. బీఆర్‌ఎస్ పునః సమీక్ష చేసుకుంటేనే మంచిది.భవిష్యత్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠగా మారతాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాకపోతే ఈ విజయం కాంగ్రెస్‌కు తాత్కాలిక ఉత్తేజాన్ని మాత్రమే ఇస్తుంది. జూబ్లీహిల్స్ ఫలితాలు తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మార్చుతాయని చెప్పుకోవచ్చు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే ఈ మార్పు ప్రజలకు మేలు చేస్తుందా, లేక మరో సారి గొడవలకు దారి తీస్తుందా? సమయమే సమాధానం చెప్పాలి.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ ( 17 నమస్తే ఉదయం) సీఎం సహాయ నిధి పేదల వైద్యానికి వరం లాంటిదని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి డివిజన్ కి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం చుక్క మల్లేష్ కు 60వేలు,మెహునిసా బేగంకు15వేలు,నందు కుమార్ 27వేలు మొత్తం 1,02,000 రూపాయల,చెక్కులు మంజూరు కాగా సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ తో కలిసి బోయిన్ పల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో బాధితులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీ.ఎం సంక్షేమ సహాయనిది పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందన్నారు.నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్, కరంచంద్, జనార్ధన్, తులసి సురేష్, సంతోష్,బాలకృష్ణ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యం కోసం ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# యా అల్లా!... సౌదీలో మృత్యు ఘోష

## 43 మంది సజీవ దహనం

## మృతులంతా హైదరాబాదీలే!



- సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం..
- బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో దుర్ఘటన
- 43 మంది హైదరాబాదీ ఉమ్రా యాత్రికుల సజీవ దహనం
- మరో ఇద్దరు కర్ణాటకవాసుల మృత్యువాత
- మక్కాను సందర్శించుకుని మదీనా వెళ్తుండగా దుర్ఘటన
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది
- ఈ నెల 9న నగరం నుంచి వెళ్లిన 54 మంది
- బస్సులో మదీనాకు బయలుదేరిన 46 మంది.. ఒక్కరు మినహా మిగతా వారంతా మృత్యువాత.. ఘోర ప్రమాదంతో హైదరాబాద్‌లో విషాదం..

**హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే ఉదయం)**

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా, మదీనా సందర్శించుకోవాలనే తమ చిరకాల వాంఛను తీర్చుకునేందుకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 45 మంది ఉమ్రా యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో 43 మంది నగరానికే చెందిన వారు కాగా, మరో ఇద్దరు కర్ణాటకకు చెందినవారు. వీరు ప్రయాణిస్తున్న బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా మంటలు చెలరేగడంతో అంతా సజీవ దహనమయ్యారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున మదీనాకు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఉదయాన్నే అందిన పిడుగుపాటు లాంటి వార్త నగర వాసుల్ని కలచివేసింది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి కుమారులు, కుమార్తెలు, వారి పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మొత్తం 46 మంది బస్సులో ప్రయాణిస్తుండగా ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. మరణించిన నగర వాసుల్లో 18 మంది పురుషులు, 26 మంది మహిళలు కాగా వీరిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. వీరి మృతదేహాలను జెడ్డాలోని కింగ్ ఫహద్, కింగ్ సల్మాన్, అల్ మిఖత్ ఆస్పత్రులకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. జెడ్డాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను మదీనాలోనే స్థానిక సంప్రదాయాల మేరకు ఖననం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు.



## స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

### కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లో జవాబు చెప్పాలని ఆదేశాలు

### పదిమంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

### నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలని ఆదేశం

**న్యూఢిల్లీ, నవంబర్ 17 (నమస్తే ఉదయం)**

తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై విరీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖల్కైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జుల్కై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.




# గ్రామ సంఘం ఆధ్వర్యంలో పేదలకు 'గుప్పెడు బియ్యం'

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం)ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామం మహిళా సంఘం ఆధ్వర్యంలో గుప్పెడు బియ్యం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మహిళలు, పోషకాహారం లోపించిన పిల్లలు, మధ్యస్థ పోషకాహారం లోపించిన పిల్లలు' అనే అంశంపై సీసీ నవీన్ రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన 40కేజీల బియ్యాన్ని సభ్యురాలు నారాయణమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటి కోఆర్డినేటర్ నవీన్ రెడ్డి మాట్లాడుతు...ప్రతి గ్రామంలో పేద గర్భిణులు, పోషకాహార లోపం ఉన్న పిల్లలను దత్తత తీసుకుని వారికి పోషకాహారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షురాలు సంతోషమ్మ, వీఓఏ శోభా, సభ్యులు పాల్గొన్నారు.



బీరంగూడలో జరిగిన అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

# అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

### మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్ చెరు, నవంబర్ 17(నమస్తే ఉదయం): అయ్యప్ప స్వామిని భక్తితో కొలిచిన వారి కోర్కెలు తప్పక నెరవేరుతాయని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మల్లికార్జున హిల్స్ కాలనీలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, నందారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాండు, రమేష్ గౌడ్, సిఐ నరేష్, తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న బొల్లారం పోలీసులు

### 37 క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం కేసు నమోదు



పటాన్ చెరు, నవంబర్ 17(నమస్తే ఉదయం) పేదవాడి తిండి కోసం ప్రభుత్వ కేటాయింపుతో సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిపోతున్నాయి. కొందరు రేషన్ డీలర్లు పేద ప్రజలకు చెందాల్సిన ఉచిత బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలిస్తున్న విషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. బొల్లారం జ్యోతినగర్ కు చెందిన షాపు నెంబర్ 17 నిర్వాహకురాలు చప్పిడి అలివేలమ్మ నిర్వహిస్తున్న రేషన్ షాపునుండి 80 బస్తాలు అనగా సుమారు 37 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని , బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు, డ్రైవర్ రాజును, వాహన యజమాని జైపాల్ , నిర్వాహకురాలు అలివేలమ్మల పై జిన్నారం డిప్యూటీ తహసీల్దార్ సివిల్ సప్లై అనిల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి తెలిపారు.




# మానవత్వం చాటుకున్న మానవతావాది

### అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన మాదిరి పృథ్వి రాజ్

పటాన్ చెరు,నవంబర్ 17(నమస్తే ఉదయం): సాటి మనిషికి ఆపదలో సాయం చేయడానికి వెనుకడుగు వేస్తున్న ఈరోజుల్లో అనాధగా జీవిత చివరి మజిలీలో విగత జీవిగా ఉన్న ఓ వ్యక్తికి, అన్నీ తానై కుటుంబ సభ్యుడిలా మారి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి ఎండిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు. మానవత్వం చాటుకున్నారు. ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోయిన ఓ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరు రాకపోవడంతో, ఆస్పత్రి నుండి స్వయంగా మృతదేహాన్ని తీసుకెళ్లి, అన్ని కర్మకాండలు చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. స్వంత పనులు చేసుకోవడానికి సమయం లేని ఈరోజుల్లో ఇతరుల కోసం ఇలా ముందుకు వచ్చి చేయూతనిచ్చే మనుషులు చాలా అరుదుగా ఉంటారు. ఎండిఆర్ ఫౌండేషన్ చేసే సేవా భావం, కరుణ, మానవత్వం ప్రతీ ఒక్కరికి ప్రేరణ కావాలని, ఇలాంటి సేవలు సమాజాన్ని మరింత మంచి మార్గం వైపు నడుపుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ ను పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, వై శ్రీధర్ తదితరులు

# డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్‌ను పరామర్శించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

బుద్వేల్, నవంబరు 17 (నమస్తే ఉదయం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం కలిసి పరామర్శించారు. ప్రేమ్ రాజ్ యాదవ్ త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను అని అన్నారు. ప్రేమ్ రాజ్ ను పరామర్శించిన వారిలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, యాదగిరి లు ఉన్నారు.

# మక్కా ప్రమాదంలో చింతల్‌మెట్ వాసి మృతి

### పర్వీన్ బేగం ఇంటి వద్ద విషాదఛాయలు

### పర్వీన్ బేగం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ రహమత్ బేగ్



పర్వీన్ బేగం

బుద్వేల్, నవంబరు 17 (నమస్తే ఉదయం) : సౌది అరేబియాలో ఘోర బస్సు ప్రమాద ఘటన చోటు చేసుకుంది. మక్కా నుంచి మదీనాకు వెళ్లుండగా బదర్ మదీనా ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. డీజిల్ ట్యాంకర్ ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈనెల తొమ్మిదిన సులేమాన్ నగర్ చింతల్ మెట్ కు చెందిన నిజాం భార్య పర్వీన్ బేగం (33) మక్కా ట్రావెల్స్ ద్వారా మరో 5 మంది బంధువులతో కలిసి మక్కా యాత్రకు వెళ్ళింది. మక్కా యాత్ర పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి మక్కా నుంచి మదీనాకు వెళ్లుండగా జరిగిన బస్సు ప్రమాదంలో పర్వీన్ బేగం మృతి చెందింది. ఆమెకు ఐదు మంది కుమారులు ఉన్నారు. మక్కా యాత్ర పూర్తి చేసుకున్న తర్వాత తన కుమారులతో వీడియో కాల్ మాట్లాడినట్లు భర్త నిజాం తెలిపారు. పర్వీన్ బేగం మృతితో చింతల్ మెట్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పర్వీన్ బేగం కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ రహమాత్ బేగ్ పరామర్శించి ప్రగడ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని తెలిపారు.

# విద్యుదాఘాతానికి బర్రెల మృత్యువాత

### జీవనోపాధి కోల్పోయిన రైతు



పటాన్ చెరు,నవంబర్ 17(నమస్తే ఉదయం): విద్యుత్ శాఖ అధికారుల నిర్వాకం ఓ రైతు జీవనోపాధిని కోల్పోయేలా చేసింది. చిన్న కంజర్ల గ్రామవాసి గొల్ల లక్ష్మీనారాయణ కు చెందిన మూడు బర్రెలు విద్యుత్ వైర్లు తెగిపడి మృత్యువాత పడ్డాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే బర్రెలు మృతి చెందాయని లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేసాడు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కంజర్ల గ్రామ వాసి గొల్ల లక్ష్మీనారాయణ మూడు బర్రెలు మేత కోసం చిన్న కంజర్ల ,అందూర్ మధ్య మేత మేపడానికి వెళు తుండగా విద్యుత్ స్తంభాల నుండి ఎల్ టి లైన్ వైర్లు తెగపడి మూడు బర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఒక్కొక్క బర్రె ఖరీదు సుమారు లక్షా యాభై వేల రూపాయలు ఉంటుందని గొల్ల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేసాడు. విద్యుత్ వైర్లు తెగపడి బర్రెల మృత్యువాత పడిన కారణంగా తన జీవన ఆధారం పోయిందని, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై ప్రభుత్వం ,విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లక్ష్మీనారాయణకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.




వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న అయ్యప్ప స్వాములు

# బొల్లారంలో సిటీ న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పటాన్ చెరు నవంబర్ 17(నమస్తే ఉదయం): బొల్లారం సాయి బాబా మందిరం వద్ద సిటీ న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో మియాపూర్ సిటీ న్యూరో సెంటర్ వైద్య సిబ్బందితో ప్రజలకు వివిధ రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వి వేణు పాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం సేవా దృక్పథానికి నిదర్శనం అన్నారు.ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన మియాపూర్ సిటీ న్యూరో సెంటర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై అవగాహన కలిగించు కోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిటీ న్యూరో సెంటర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాయి,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ జన్మదిన వేడుకలలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

# ఘనంగా కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం): కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ కొమురవెల్లి మండల కేంద్రంలో కార్యకర్తలు అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కొమురవెల్లి మండలంలో పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చిన కంటికి రెప్పలా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చేర్యాల, మద్దూరు మండల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# దైవ సేవకుల ప్రార్థనల మధ్య సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమం



సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మన్నా మినిస్ట్రీస్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కార్ల్ డి కొమానపల్లి



సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మన్నా మినిస్ట్రీస్ కు చెందిన బిషప్ ఎం ఎలీషా రాజు



సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపుడి



భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు

బుద్వేల్, నవంబరు 17 (నమస్తే ఉదయం) : అమలాపురం పాలగుమ్మి మన్నా చర్చ్ సంఘ కాపరి సిస్టర్ చెవాకుల కృపా రత్నం (84) భూస్థాపన కార్యక్రమం సోమవారం అనేకమంది దైవ సేవకుల ప్రార్థన మధ్య జరిగాయి. 53 సంవత్సరాలుగా పాలగుమ్మి ప్రాంతంలో సేవ చేస్తున్న సిస్టర్ చెవాకుల కృపా రత్నం శనివారం అర్ధరాత్రి దేవునిలో నిద్రించారు. ఆమె భూ స్థాపన కార్యక్రమాలు సోమవారం డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పాలగుమ్మి లో గల మన్నా చర్చిలో రెవరెండ్ ప్రేమానందం అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో మన్నా మినిస్ట్రీస్ ఆంధ్రప్రదేశ్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కార్ల్ డి కొమానపల్లి పాల్గొని భూ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. సిస్టర్ చెవాకుల కృపా రత్నం, పాస్టర్ చెవాకుల ప్రభుదాస్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన చేతుల మీదుగా భూ స్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏలూరు మన్నా చర్చ్ లో సేవ చేస్తున్న బిషప్ ఎం ఎలీషా రాజు పాల్గొన్నారు. రెవరెండ్ ప్రభుదాస్, సిస్టర్ కృపా రత్నం ల సేవా పరిచర్యల గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపుడి బైబిల్ సందేశాలను అందజేశారు. 53 సంవత్సరాలుగా పాలగుమ్మి మన్నా చర్చ్ లో సిస్టర్ చెవాకుల కృపా రత్నం చేసిన సేవలను సంఘ విశ్వాసులు, ఆమె ద్వారా యేసయ్య మార్గములో నడుచుచుకున్న వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిస్టర్ చెవాకుల కృపా రత్నం కుమారులు రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్, సిస్టర్ శిరోమణి, సిస్టర్ విజయ, సిస్టర్ కృపా కుమారి, రెవరెండ్ జాన్ వెస్లీ, సిస్టర్ సీ హెచ్ ప్రభావతి లీ పాల్గొన్నారు. హైదరాబాద్, విజయనగరం, బెంగళూరు, అమలాపురం ప్రాంతాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# విత్తనోత్పత్తితో అన్నదాతలకు అధిక లాభాలు

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సీడ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం వి నగేష్ కుమార్



మహదేవునిపేటలోని రైతు పొలంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీడ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ. నగేష్ కుమార్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (బిజినేపల్లి) నవంబర్17 (నమస్తే ఉదయం) రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లోనే నాణ్యమైన విత్తనోత్పత్తి చేపడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సీడ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ. నగేష్ కుమార్ అన్నారు. సోమవారం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహదేవునిపేట గ్రామానికి చెందిన మహిళా రైతు విజయ పోలంలో తాము పంపిణీ చేసిన కేఎన్ఎం-1638 అనే వరి రకం పంటను పరిశీలించి రైతులకు విత్తనోత్పత్తి ద్వారా కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంవీ నగేష్ కుమార్ మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 1044 మంది ఉత్తమ రైతులను గుర్తించి వారందరికీ ఉచితంగా కేఎన్ఎం-1638 వరి విత్తనం అందజేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించినట్లు తెలిపారు. విత్తనోత్పత్తి చేపట్టే విత్తన రకం, పంట కాలం, నీటి వినియోగం, తెగుళ్ళను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలని సూచిం చారు. విత్తనోత్పత్తి సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను. యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి ప్రోత్సహించారు. విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా రైతులకు విత్తన ఖర్చులు తగ్గడంతో పాటు కల్తీ లేని నాణ్యమైన విత్తనం సాగు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొంది ఆదాయం పొందవచ్చని తెలిపారు. పాలెంలోని ఆర్ ఏ ఆర్ ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎల్ కృష్ణ మాట్లాడుతూ... యాసంగిలో సాగు చేసే వివిధ పంటల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణకు చేపటాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అలాగే రైతులకు వివిధ పంటల సాగులో ఎలాంటి సందేహాలు: ఉన్నా వ్యవసాయ శాస్త్రవేత్తలను కలిసి నివృత్తి చేసుకొని లాభదాయకమైన సాగు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ... రైతు సోదరులు సాగు లొ సమయాను సరంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లొ కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజశేఖర్,తదితరులు ఉన్నారు.

# రేషన్ షాపులే బియ్యం దందాకు కేంద్రాలు...?



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 (నమస్తే ఉ దయం)ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు అందజేస్తున్న రేషన్ బియ్యం కొందరి జేబులు నింపుతున్నాయి. కొందరు మాఫియా ముఠాగా ఏర్పడి లబ్ధిదారుడి నుంచి రూ.15కు కొనుగోలు చేస్తూ మార్కెట్లో రూ.20నుంచి రూ.25వరకు విక్రయిస్తూ ప్రతినెల లక్షలు ఆర్జిస్తున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ రేషన్ బియ్యంను సేకరించేందుకు రేషన్ మాఫియా ఎక్కడికక్కడ బియ్యం నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా రేషన్ మాఫియాకు గద్వాల పట్టణంతో పాటు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలోని చుట్టుపక్కల ప్రాంతాలు అడ్డగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి నుంచి గమ్యస్థానానికి చేరేలా ప్రణాళికలు రూపొందించడంలో మాఫియాకు అందె వేసిన చేయిగా కితాబు ఉంది.

**రేషన్ షాపులే కేంద్రాలుగా...**

గద్వాల పట్టణంలో దాదాపు 23 రేషన్ దుకాణాలు పని చేస్తున్నాయి. ప్రతి షాప్ లో నెలకు 100 నుంచి 150 క్వింటాల బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రతి షాప్ లో 75 శాతానికిపైగా మంది బియ్యం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది లబ్ధిదారుల నుంచి రేషన్ డీలర్లు బియ్యంకు బదులుగా కిలోకు రూ.15 నుంచి రూ.20ల చొప్పున డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని మరుసటి నెల బియ్యం కోటా కింద లబ్ధిదారులకు పంపిణీ చేసి, ఆ నెలలో ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యాన్ని గోదాం నుంచి నేరుగా బియ్యం వ్యాపారులకు పంపిస్తారని సమాచారం. ప్రతినెల ఇదే తంతు జరుగుతుంది. ఇలా పట్టణంలో 50 శాతం మంది రేషన్ డీలర్లు బియ్యం దందా చేస్తున్నట్లు సమాచారం.

ప్రతి నెల 15 తరువాత రేషన్ షాపుల నుండి కలెక్ట్ చేసుకునేందుకు వచ్చే దళారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న డిమాండ్‌ను బట్టి కిలో బియ్యానికి రూ. 15నుండి రూ. 20 వరకు చెల్లిస్తున్నారు. వీరు నేరుగా మిల్లర్లకు చేరవేసి కిలోకు రూ. 25 చొప్పున విక్రయిస్తున్నారు. నిత్యకృత్యంగా మారిన ఈ దందాను కట్టడి చేసేందుకు సివిల్ సప్లై అధికారులు కానీ, విజిలెన్స్ వింగ్ కానీ పట్టించుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. కార్డు హోల్డర్సే అమ్ముకుంటున్నారని తామేం చేస్తామన్న సమాధానాలు వినిపిస్తున్న వారూ లేకపోలేదు.

**రేషన్ షాపుల నుంచి రైస్ మిల్లులకు....**

గద్వాల పట్టణంలోని రాజవీధి, గంజిపేట, నల్లకుంట, కుంటవీధి,రాఘవేంద్ర కాలనీ,మోమినమల్లా, దౌదర్ పల్లి, తదితర ప్రాంతాలలో ఉన్న రేషన్ షాపుల నుంచి దళారులు కొనుగోలు చేసి రేషన్ బియ్యం కర్ణాటక రాష్ట్రంలోని పలు మిల్లులకు తరలించారు. కాని గత కొన్నినెలలుగా గద్వాల పరిసర ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లులకు బహిరంగానే తరలిస్తున్నారు. మిల్లు ఆవరణలో సన్న బియ్యం, వడ్లు నిలువ ఉంచిన సంచులను స్టాక్ చేసి పెడ్తారు. రాత్రి వేళల్లో వారు రేషన్ షాపుల నుంచి సేకరించిన బియ్యాన్ని నేరుగా రైస్ మిల్ మిషనరీలో స్టోర్ చేయిస్తున్నారు. ఒక వేళ అధికారులు ఆకస్మిక దాడులు చేస్తే మిల్లు ఆవరణలో ఉన్న సన్న బియ్యం సంచులను చూసి వెనుదిరిగిపోతారన్న ధీమాతో ఈ ఎత్తుగడతో తమ వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

**పోలీసుల దాడులే ఎక్కువ..**

గద్వాల జిల్లాలో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవడంలో సివిల్ సప్లై అధికారుల కన్నా పోలీసులు చేస్తున్న దాడులే ఎక్కువ అని చెప్పాలి. గద్వాల జిల్లాల్లో ఇప్పటి వరకు పట్టుకున్న రేషన్ బియ్యం కేసుల్లో పోలీసు యంత్రాంగం నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**అక్రమార్కులపై చర్యలు తప్పవు**

పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపైన చర్యలు తీసుకుంటాం.

**అలివేలు, ఆర్డీవో గద్వాల**


ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి

## ధాన్యం కొనుగోలు నిరంతరం పర్యవేక్షణ జరగాలి

### అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం): ప్రజా వాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా లోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తు లను జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం లో వచ్చే దరఖాస్తు లను ఎప్పటికప్పుడు పరిష్కరించి, అర్జీ పెట్టుకున్న వారికి తగు సమాచారం అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు, మండల స్పెషల్ అధికారులు నిరంతరం విజిట్ చేస్తూ, పర్యవేక్షణ చేయాలన్నారు. ఈనాటి ప్రజావాణి కార్యక్రమనికి జిల్లా నుండి 39 దరఖాస్తు లు వచ్చాయి, అందులో కొన్నింటి వివరాలు.జనగామ పట్టణం నందు స్వర్ణ కళామందిర్ ప్రక్కన గల తన స్థలాన్ని కొందరు కూరగాయల వ్యాపారులు దౌర్జన్యంగా ఆక్రమించి కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఖబ్జా చేసిన స్థలాన్ని ఖాళీ చేయించాలని శ్రీహరి అనే వ్యక్తి కోరాడు. రాజీవ్ నగర్ కాలని లో నివాసం ఉంటున్న మోతే సంధ్య ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగరలని దరఖాస్తు చేసుకుంది. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యుటీ కలెక్టర్, ఆర్డీ వో లు, కలెక్టరెట్ ఏఓ,అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


అల్వాల్‌లోని గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

# కార్తీక మాస చివరి సోమవారం కిటకిటలాడిన దేవాలయాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 17 (నమస్తే ఉదయం): అల్వాల్ పరిధిలోని పలు శివాలయాలలో భక్తులచే కి క్కిరిసిపోయాయిది. మరకత లక్ష్మి గణపతి దేవాలయం కానాజీ గూడలో ఆది శంకరాచార్య అర్చిత స్ఫటిక లింగమునకు భక్తులు రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేసి అత్యంత భక్తిని చాటుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# కన్నుల పండువగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం

## ఉత్సాహంగా నందికోల సేవ, రథోత్సవం




గద్వాల టౌన్,నవంబరు 17(నమస్తే ఉదయం) గద్వాల పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో వీరశైవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భద్రకాళీ వీరభద్రస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా సాగింది. ప్రతి యేటా కార్తీక బహుళ త్రయోదశి నాడు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించడం దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. ఈ సందర్భంగా తెల్లవారుఝామున ఆలయం వద్ద ధ్వజారోహణ నిర్వహించి స్వామివారికి పట్టణ సమీపంలోని కృష్ణానది నుంచి ప్రత్యేకంగా తెచ్చిన నదీ జలాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, హోమం తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా పూర్తిచేసి నిర్దేశించి ముహూర్త సమయానికి భద్రకాళీ వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు శివరాజ స్వామి, అర్చకులు వీరేష్ స్వామి, అరుణ్ కుమార్ స్వామి. శ్రావణ్ కుమార్ స్వామిల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆనంతరం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవుల ప్రత్యేక ఆచారంగా ఉన్న నందికోల సేవను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వీరశేవ సంఘం, వీరశ్రవ మహిళా సమాజం, వీరశైవ యువజన సేవా సంఘం నాయకులు, యువజన సేవా సంఘం ప్రతినిధులతో పాటు కులబాంధవులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


పూజలు చేస్తున్న ఝాన్సీరాజేందర్ రెడ్డి

# కార్తీకమాసం ఆధ్యాత్మికతకు ప్రతీక

## టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి

### కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం): కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు.ఉదయం వేళ దేవాలయానికి చేరుకున్న ఝాన్సి రాజేందర్ రెడ్డి ని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి అభిషేకం, అర్చన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక హరతి ఇచ్చి, ఆలయ పరిసరాల్లో కొంతసేపు భక్తులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్తీకమాసం ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పవిత్ర నెలలో చేసే పూజలు ప్రతి ఇంటికి శాంతి, అభివృద్ధి, సౌభాగ్యాలను తీసుకువస్తాయన్నారు.. స్థానికులు దేవాలయ అభివృద్ధి సంబంధిత అంశాలను వారి దృష్టికి తీసుకురాగా, ఇటీవలే ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించారని తెలిపారు, వీటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ లవుద్యా మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నాగన్న, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పాలెంలోని టీఎస్ఎం హైస్కూల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో రఘునందన్ శర్మ

# పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

## మండల విద్యాధికారి ఎంఈవో రఘునందన్ శర్మ

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (బిజినేపల్లి) నవంబర్17(నమస్తే ఉదయం) పదవ తగరతిలో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని బిజినేపల్లి ఎంఈవో రఘునందన్ శర్మ అన్నారు. సోమవారం మండలంలోని తోటపల్లి సుబ్రమణ్యం మెమోరియల్ హైస్కూల్ ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు, వ విద్యాహ్న భోజనం, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థులు విధిగా ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా రావడం ద్వారా ప్రతి పాఠ్యాశం చక్కగా బోధపడుతుందన్నారు. తరగతి గదిలోని విద్యార్థులంతా గ్రూప్స్ ఏర్పడి ప్రతి అంశం చర్చించడం ద్వారా నేర్చుకున్న అంశాలు ఎక్కువ కాలం గ ర్తుంటాయని సూచించారు. ప్రభుత్వం చూపిన మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రతి అంశాన్ని ఆన్లైన్ లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయుడిని అదేశించారు.


మక్కలు పంపిణి చేస్తున్న రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ సుశీల

# రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాల పంపిణీ

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం)::షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక (ఎస్సి ఎస్పి) 2025-2026 లో భాగంగా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీ.జే.టీ.ఏ.యూ)కు చెందిన మొక్కజొన్న పరిశోధన విభాగం (ఏ.ఆర్.ఐ), రాజేంద్రనగర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలం, కన్నాయిపల్లి గ్రామంలోని రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామానికి చెందిన 50 మంది ఎస్సి. రైతులకు అధిక దిగుబడినిచ్చే 'డి.హెచ్.ఎం 117' మొక్కజొన్న రకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతులకు అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సాగుపై విలువైన సూచనలు అందించారు: డాక్టర్ సుశీల (ప్రధాన శాస్త్రవేత్త, పీ.జే.టీ.ఏ.యూ మొక్కజొన్న పరిశోధన సంస్థ), మొక్కజొన్న సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, ఎరువుల వినియోగంపై మెళకువలను రైతులకు వివరంగా వివరించారు. డాక్టర్ బి. మల్లయ్య (ప్రధాన శాస్త్రవేత్త): పంటలకు సోకే వివిధ రకాల చీడపీడల నియంత్రణ, సమగ్ర యజమాన్యం గురించి రైతులకు తెలియజేశారు. శ్రీనివాస్ రెడ్డి (వ్యవసాయ అధికారి): నానో యూరియా, డీఏపీ వంటి ఎరువుల సమర్థవంతమైన వినియోగం గురించి, అలాగే పీ.ఎస్.బి వంటి జీవన ఎరువుల ( బయో- ఫర్టిలైజర్స్ ) లభ్యత, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పి.జె.టి.ఏ.యు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త సమన్వయకర్త డాక్టర్ టి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి కల్పన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యులు మంతపురి యాదగిరి మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించినందుకు పీ.జే.టీ.ఏ.యూ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విత్తనాలు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జాతీయ రహదారిపై ఐదు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం

### జాతీయ రహదారి విస్తరణ పనులపై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమీక్ష

పటాన్ చెరు, నవంబర్ 17(నమస్తే ఉదయం): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మదీనా గూడ, సంగారెడ్డిల మధ్య ప్రజల సౌకర్యార్థం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం డివిజన్, పటాన్చెరు డివిజన్లో పరిధిలో ఐదు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టబోతున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జాతీయ రహదారి సంస్థ, పోలీసు, ట్రాఫిక్ శాఖల అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించబోయే స్థలాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ క్షేత్రస్థాయి పర్యటన చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహెచ్ఎల్ చౌరస్తా నుండి పటాన్చెరు పట్టణంలోని సాకి చెరువు వరకు ప్రతిరోజు నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం రహదారిని దాటుతూ ఉంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను ఐదు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించబోతున్నట్లు తెలిపారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని అశోక్ నగర్,. బీరంగూడ ఐటిఐ,. రామచంద్రపురం రైల్వే లైను, పటాన్చెరు బస్టాండ్, పటాన్చెరు సాకి చెరువు సమీపంలో వీటిని నిర్మించబోతున్నట్లు తెలిపారు. విశాలమైన విస్తీర్ణంతో, లిఫ్ట్ సౌకర్యంతో వీటిని నిర్మించబోతున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని.. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ, డిఎస్పి ప్రభాకర్, సిఐలు వినాయక్ రెడ్డి, లాలు నాయక్, ఎక్సైసీఐ పరమేశ్వర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


ఫుట్ ఓవర్ బ్రిడ్జిల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 17(నమస్తే ఉదయం)ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటోందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.సోమవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 250 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ... అన్ని వర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు.పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు విడుదలవారీగా రూ 5లక్షలు అందజేయడం జరుగుతుందని అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని తెలిపారు. ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు అందించే విధంగా నా వంతు గా కృషి చేస్తానని గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి నా చివరి శ్వాస వరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, గద్వాల, మల్దకల్, గట్టు, ధరూర్, కేటిదొడ్డి , మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, మాజీ జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్,జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీలు ప్రతాప్ గౌడ్ విజయ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఉరుకుందు, భాస్కర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, తూం కృష్ణ రెడ్డి,యుగంధర్ గౌడ్ , నాగన్న గోపి, భగవంతు, రామకృష్ణ, రాంగోపాల్ , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

# ప్రేమ మూర్తి సిస్టర్ కృపా రత్నం


తమ తల్లి సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆమె తనయుడు రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్. చిత్రంలో కుటుంబ సభ్యులు


సాక్ష్యం చెబుతున్న సిస్టర్ చెవాకుల కృపా రత్నం చిన్న కుమార్తె సిస్టర్ కృపా కుమారి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


భూస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు


మాట్లాడుతున్న బ్రదర్ జోబ్

### సిస్టర్ చెవాకుల కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో దైవ సేవకులు

అమలాపురం, నవంబరు 17 (నమస్తే ఉదయం) : డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పాలగుమ్మి మన్నా చర్చ్ లో సేవ చేసిన సిస్టర్ చెవాకుల కృపా రత్నం ప్రేమ మూర్తి అని పలువురు దైవ సేవకులు కొనియాడారు. 53 సంవత్సరాలపాటు పాలగుమ్మి లో సంఘ కాపరిగా సేవ చేసిన సిస్టర్ కృపా రత్నం చుట్టుపక్కల గ్రామాలలో యేసయ్య గురించి బోధించి ఆయన మార్గంలో అనేక మందిని నడిపించారని గుర్తు చేసుకున్నారు. పాలగుమ్మిలో ఏమీ లేని స్థితిలో ఆమె దైవ సేవకులు రెవరెండ్ ప్రభుదాస్ తో కలిసి సేవను ప్రారంభించారన్నారు. వారి కుటుంబం అనేక మందిని మంచి మార్గంలో నడిపించిందని అన్నారు. సిస్టర్ చెవాకుల కృపా రత్నం కుమారుడు, ముగ్గురు కుమార్తెలు దైవ సేవలో కొనసాగుతున్నారని గుర్తు చేసుకున్నారు. అనేకమంది దైవ సేవకులు, విశ్వాసులు, కుటుంబ సభ్యుల మధ్య భూస్థాపన కార్యక్రమం జరిగింది. దైవ సేవకులు రెవరెండ్ డాక్టర్ ప్రేమానందం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రెవరెండ్ జోషి కుమార్, రెవరెండ్ డానియల్ రాజు తదితరులు శుభాలు తెలియ చేశారు. ఈ సందర్భంగా వారి ద్వారా యేసయ్య మార్గములో నడచిన బ్రదర్ సత్యానందం, బ్రదర్ లాజరస్, బ్రదర్ బోయాజు తో పాటు దైవ సేవకులు సామ్యూల్ రాజు, జాన్ సుందర్ రావు అమ్మ గారి కోసం, ఆమె చేసిన సేవా పరిచర్య కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో కుమారులు రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్, కుమార్తెలు సిస్టర్ శిరోమణి, సిస్టర్ విజయ, సిస్టర్ కృపా కుమారి, అల్లుడు రెవరెండ్ జాన్ వెస్లీ, మనుమలు గ్లాడి ప్రేమ్ సన్, డానీ, హోలీ, జెమిమా లు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ నుంచి భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మన్నా చర్చ్ సభ్యులు :**

దైవ సేవకురాలు సిస్టర్ కృపా రత్నం భూ స్థాపన కార్యక్రమంలో బ్రదర్ సాయిలు, సిస్టర్ అమృత, బ్రదర్ డానియల్, సిస్టర్ మాధవి, సిస్టర్ సరళ, బ్రదర్ శశిధర్, సిస్టర్ శాంతి , బ్రదర్ సాయి ప్రశాంత్( నాని), బ్రదర్ విశాల్ లు పాల్గొన్నారు.



## శ్రీ గోపాలకృష్ణ మందిరంలో కార్తీక మాసం వనభోజనాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 ( నమస్తే ఉదయం) గద్వాల పట్టణం గంట వీధి లో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ గోపాలకృష్ణ మందిరం. కార్తీక మాసంలో ఆఖరి సోమవారం కాబట్టి శ్రీ గోపాలకృష్ణ మందిరం నందు హిందూ బంధువుల సామూహిక వనభోజనాలు ఆలయ కమిటీ తరపున నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వచ్చి గోపాలకృష్ణుని పూజించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీధి ప్రజలు కార్తీక వనభోజనం ఉత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు .



## కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 17 (నమస్తే ఉదయం) నియోజకవర్గంలోని వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారంమల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఈ ఈ లక్ష్మణ్ , డి ఈ లౌక్య , ఎస్ ఎన్ డి పి విభాగ ఆదికారులు ఈ ఈ మాధవి, డి ఈ సందీప్ లతో కలిసి మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖరరెడ్డి వివిధ కాలనీల ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సఫిల్గూడ చెరువు నుండి సూర్య నగర్ కాలనీ వరకు ఉన్న బాక్స్ డ్రైను శిథిలావస్థ చేరుకున్నది. ఇది 25 ఏళ్ల పురాతన మైనది కావున ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్న%శ%దున, తక్షణమే సర్వే చేసి కొత్త బాక్స్ ప్రతిపాదనలకు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను కోరడం జరిగింది.అదేవిధంగా బండ్ల చెరువు నుంచి వచ్చే ఓవర్ ఫ్లో ల వల్ల షిరిడి నగర్, ఎన్ఎండిసి కాలనీ పలు కాలనీలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి .ఈ సమస్య పరిష్కారం కొరకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.


ప్రజావాణిలో పలు అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రాన్ని అందించిన కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

## అల్వాల్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 17 ( నమస్తే ఉదయం) అల్వాల్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. అల్వాల్ సర్కిల్ ఆఫీసులో సోమవారం జరిగిన ప్రజావాణిలో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలకు త్వరితగతిన పరిష్కార మార్గం చూపాలని అన్నారు. ఏఎంసి హేమలత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ క్రాంతి కి అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కొత్తచెరువు పరిసర ప్రాంతాల్లో చెట్లు గుబురుగా ఉండటం వలన పాముల బెడద ఎక్కువ అయిందని వారికి చెప్పారు. పాముల బెడదతో చుట్టుపక్కల కాలనీరవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారని సంబంధిత అధికారులకు తెలియపరచానన్నారు. ఓల్డ్ ఆల్వాల్ సాయిబాబా కాలనీ కమాను వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున మ్యానువోల్ నుండి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. మ్యాన్ హెూల్ ద్వారా వ్యర్థ పదార్థాలు బయటకు వచ్చి బాటసారూలకు ఇబ్బందిగా మారిందని ఉన్నదని చెప్పారు. 5 ఏళ్లుగా సమస్యలతో కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. అనంతరం ఇందిరాగాంధీ స్టాచ్ వద్ద పైపులైను పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించినట్లు కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ ప్రశాంతి, ఏఈ వరుణ్ దేవ్, నాయకులు యాదగిరి గౌడ్, ప్రేమ్ కుమార్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733